

స్నేహ'హస్తం' ఇవ్వండి

కాంగ్రెస్ తొలి జాబితా అనంతరం వికారబాద్‌లో రాజకీయం రసవత్తరంగా మారింది. 10లో ▸



అన్ని వార్డుల్లో అంధకారం

పండుగ రోజుల్లోనూ గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి. వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 11లో ▸



సరస్వతీ నమస్తుభ్యం

దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గామాత సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 11లో ▸

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీ నాయకులకు బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గోవిందాపూర్, చిట్యాల గ్రామాల కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లోకి చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. అన్ని రంగాల్లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పార్టీ సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సౌభాగ్యలక్ష్మి'తో మహిళలకు భరోసా

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

మోమిన్‌పేట: బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్న కోల్కుంద, కోల్కుంద, అంరాధిఖుర్దు, అంరాధికలాన్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో వచ్చిన తరువాత ప్రతిపక్షాలకు మాటలు లేవని అన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం మహిళలకు కొండంత అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి మహిళలకు నెలకు రూ. 3వేలు అందుతుందని పేర్కొన్నారు. 60 సంవత్సరాలు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. వారి పాలనలో స్కాంలు తప్ప ప్రగతి శూన్యమన్నారు. ఇప్పుడు ఆరు గ్యారంటీతో ప్రజల వద్దకు వస్తున్నారని, వారంటీ లేని పార్టీ గ్యారంటీ ఎలా ఇవ్వగలదని ఆయన ఎద్దేవా చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత సాగు, తాగు నీటికి శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. ఇది ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమైందని తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచులు సునిత, సుజాత, అంజయ్య, సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరిశంకర్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడు, మండల యూత్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై విహరించిన పద్మనాభుడు



గజవాహనంపై పుర విహారం చేస్తున్న అనంత పద్మనాభస్వామి

అనంతగిరి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వికారాబాద్ పట్టణం ఆలంపల్లి అనంత పద్మనాభస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం రాత్రి స్వామివారు గజవాహనంపై విహరించారు. ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

హద్దు దాటితే అంతే..

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలే..

- రంగంలోకి అధికార యంత్రాంగం
- ఇప్పటికే ఫ్లెక్సీలు, హోర్డింగులు, బ్యానర్ల తొలగింపు
- గోడలపై రాతల చెరిపివేత
- రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఖర్చుపై ఆరా
- ఖర్చులు మించితే చిక్కులే..



వికారాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లోకి రావడంతో పాలనా వ్యవహారమంతా అధికారుల చేతుల్లోకి వెళ్లింది. దీంతో ఎన్నికలు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాగం సిద్ధమైంది. జిల్లాలో పటిష్టమైన నిఘాకు కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి ఉపక్రమించారు. పలు శాఖల అధికారులు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోని మారుమూల ప్రాంతంలో కోడ్ ఉల్లంఘన జరిగినా వెంటనే జిల్లా అధికారులకు సమాచారం అందే ఏర్పాట్లు చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల వ్యయం, మద్యం, డబ్బు పంపిణీ తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. వీటిని కట్టడి చేసేందుకు దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియాలో వస్తున్న వార్తలు, కథనాలపై దృష్టి సారించారు. ఇందుకోసం జిల్లా, నియోజకవర్గ స్థాయిలో మీడియా పాయింట్లు ఏర్పాటు చేశారు. కోడ్ అమలుపై పోలీసు, రెవెన్యూ శాఖలు ప్రత్యేక దృష్టి సారించాయి.రాజకీయ పార్టీల ప్రచారం ఊపందుకోవడంతో అభ్యర్థుల కదలికలపై నిఘా పెట్టారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు, రెవెన్యూ శాఖలు అప్రమత్తమయ్యాయి. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు ఉండగా బీఆర్‌ఎస్ నలుగురు, కాంగ్రెస్ ముగ్గురు అభ్యర్థులను ప్రకటించాయి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రచారాన్ని ఉధృతం చేశాయి. కొన్ని చోట్ల అభ్యర్థులను ప్రకటించకపోయినా ఆశావహులు ప్రచారం సాగిస్తున్నారు. దీంతో అధికార యంత్రాంగం నేతల కదలికలు, వాహన శ్రేణి, ప్రచారం, ఖర్చులపై దృష్టి సారించింది.

మూడు వాహనాలకే అనుమతి

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి కేవలం మూడు వాహనాలే వాడాలి. వాటినే ప్రచారానికి వినియోగించాల్సి ఉంటుంది. ప్రచారంలో ఉపయోగించే వాహనాలు, వాటి నంబర్లను అధికారులకు తెలియజేసి అనుమతి పొందాలి. అనుమతి లేని వాహనాలను సీజ్ చేసే అధికారం రిటర్నింగ్ అధికారికి ఉంటుంది. అంతేకాకుండా అనుమతి పొందిన వాహనాలకు ఒకే బ్యానర్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఒక్కో అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ. 40 లక్షలకు మించరాదు.

ప్రచారంలోనూ..

- అభ్యర్థులు ప్రచారంలో వ్యక్తిగత దూషణలకు దిగరాదు.
- మత విద్వేషాలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదు. ప్రార్థనా మందిరాలు, ఆలయాల్లో ప్రచారం చేయరాదు.
- ఒకే చోట ఇద్దరు అభ్యర్థులు ప్రచారం చేయడానికి అనుమతి లేదు.ఎదురెదురుగా రాకూడదు.
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రచారం చేసుకోవాలి.
- ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్ణీత గడువు లోగానే ముగించాలి.

పాటించాల్సిన నిబంధనలు ఇవే..

- ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున రాజకీయ పార్టీలు ప్రజాసమస్యలపై ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు చేయరాదు
- ఓటర్లను ప్రలోభపెట్టే ప్రసంగాలు చేయరాదు
- ప్రార్థనా మందిరాలు, ఆలయాల వద్ద ప్రచారం చేయరాదు.
- ప్రభుత్వం నుంచి వేతనం పొందే కళాకారులు ఏ పార్టీ తరఫున ప్రచారం చేయరాదు.
- లౌడ్ స్పీకర్లు, సభలు, సమావేశాలు, ర్యాలీలకు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలి.
- ప్రచారానికి జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు వస్తారనే సమాచారం ఉంటే ముందుగానే అనుమతి తీసుకోవాలి. వారి రూట్ మ్యాప్ కూడా అందజేయాలి.
- ప్రభుత్వ ఉద్యోగులు పార్టీల ప్రచారంలో పాల్గొనరాదు
- ఉదయం 6నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే ప్రచారం చేయాలి.
- అభ్యర్థి వెంట అనుమతి పొందిన వాహనాలు మాత్రమే తిరగాలి. కాన్వాయ్‌లో అనుమతిలేని వాహనాలు ఉంటే సీజ్ చేస్తారు.
- ప్రైవేటు స్థలాల్లో సభలు, సమావేశాలు నిర్వహించాల్సి వస్తే ముందుగానే పంచాయతీ, మున్సిపాలిటీ, సంబంధిత స్థల యజమాని నుంచి అనుమతి తీసుకోవాలి.
- పార్టీలు ఓటర్లను ప్రలోభానికి గురిచేయరాదు. మద్యం, డబ్బు ఇతర వస్తువులు పంపిణీ చేయరాదు.
- అనుమతి లేకుండా హోర్డింగ్‌లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు,డోర్, వాల్ పోస్టర్లను అంటించరాదు.



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు

ఎన్నికలకు సమాయత్తం కండి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- వికారాబాద్‌లో స్ట్రాంగ్ రూమ్, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం పరిశీలన

వికారాబాద్ అర్బన్: ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం వికారాబాద్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని, స్ట్రాంగ్ రూంను, ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ తనిఖీల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికలు సాఫీగా జరగడానికి అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు వసతులు కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రిని పూర్తిగా పరిశీలించిన తరువాతే పంపిణీ చేయాలని సూచించారు. దిన పత్రికలు,లోకల్ ఛానళ్లలో వచ్చేవార్తల పై నిఘా ఉంచాలన్నారు. పెయిడ్ ఆర్టికల్స్, ప్రకటనలు,ఫేక్ న్యూస్‌పై దృష్టి సారించాలన్నారు. అభ్యర్థుల ప్రచార వివరాలను గమనిస్తూనే రిజిస్టర్ లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, భువనేశ్వర్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు ఉన్నతాధికారులు రానున్నారని, వారి కోసం అనంతగిరిలోని హరిత రిసార్ట్‌ను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీలోపు అన్ని వసతులను కల్పించాలని సూచించారు. శుక్రవారం ఆయన హరిత రిసార్ట్‌ను సందర్శించారు. సీసీ కెమెరాలు, కంప్యూటర్ ఏర్పాటు, వైఫై సౌకర్యం సమకూర్చాలని ఆదేశించారు. రిసార్ట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఆర్‌అండ్‌బీ అధికారి శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పూర్తి ఆన్‌లైన్ విధానంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్స్, పోలింగ్ సిబ్బంది కేటాయింపు మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకు సిబ్బందిని సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వికారాబాద్, పరిగి,తాండూరు, కొడంగల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు రాహుల్‌శర్మ, లింగ్యా నాయక్, విజయకుమారి, శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల మేనేజర్ వినయ్ కుమార్, డీఈవో రేణుకాదేవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మమ్మదాన్‌పల్లి రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

ఆ పార్టీలను నమ్మితే ఆగమే

- మరోసారి ఆశీర్వదించండి అండగా ఉంటా
- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- బంగారు మైసమ్మ ఆలయంలో పూజలు
- పలు గ్రామాల్లో ప్రచారం

నవాబుపేట: కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మితే ఆగం కావడం తప్పా మిగిలేది ఏమీ ఉండదని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని బంగారు మైసమ్మ ఆలయంలో శుక్రవారం పూజలు చేసి మమ్మదాన్‌పల్లి, కుమ్మరిగూడ, మూలమాడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ నాయకులు అమలుకు సాధ్యం కాని హామీలతో ప్రజల వద్దకు వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. తెలంగాణలో ఇస్తున్న హామీలు వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు కావడం లేదన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలను ఎలా అమలు చేస్తారో చెప్పాలని నిలదీశారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. మరో సారి తనను ఆశీర్వదిస్తే వంద శాతం అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ జయమ్మ, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సర్పంచులు పద్మమ్మ, సుభాన్‌రెడ్డి, పద్మ, ఎండీ రఫీ, బల్వంత్ రెడ్డి, రత్నం, అజయ్‌కుమార్, పర్మయ్య, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు రంగారెడ్డి, మల్లారెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,203
- సాధారణ రకానికి రూ. 2,183



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: వానాకాలం వరి ధాన్యం సేకరణకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,203లు, సాధారణ రకానికి రూ. 2,183 చొప్పున మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించారు. కేంద్రాల వద్ద రైతులకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన లారీలను సమకూర్చుకోవాలని సూచించారు. వచ్చే నెల నుంచి ధాన్యం సేకరించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో 2.12 లక్షల టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున 104 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైస్ మిల్లుల వద్ద కూలీలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అవసరం మేరకు గన్ని బ్యాగులు, కాంటాలు, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డీఆర్‌డీఓ కృష్ణన్, పౌర సరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ మంగమ్మ, జిల్లా కోఆపరేటివ్ అధికారి శంకరాచారి, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్, ఎల్డీఎం రాంబాబు, రవాణాశాఖ అధికారి వెంకట్‌రెడ్డి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ బాలేశ్వరగుప్తా, సెక్రెటరీ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తగ్గేదేలే..!

- తాండూరు అభయ'హస్తం' ఎవరికో?
- కేఎల్‌ఆర్ తరఫున రమేశ్ మహరాజ్ వర్గం
- జీఎమ్మార్‌కు బాసటగా సంపత్‌కుమార్ వర్గం
- ఎవరికి వారు లాబీయింగ్





బుయ్యని మనోహర్‌రెడ్డి



కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

తాండూరు: తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ వీడటం లేదు. ఇక్కడ ఇద్దరు బలమైన నేతలు పోటీలో ఉండడమే కారణం. టికెట్ కోసం ఆ ఇద్దరు నేతలు ఎవరికి వారు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం. టికెట్ విషయంలో తగ్గేది లేదంటూ మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి పోటీ పడుతున్నారు. అయితే కేఎల్‌ఆర్ తరఫున రమేష్ మహరాజ్ వర్గం, బీఎంఆర్ తరఫున డాక్టర్ సంపత్‌కుమార్ వర్గం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే తాండూరు అసెంబ్లీ స్థానం మరోసారి చర్చనీయాంశమైంది. రెండు నెలల క్రితం వరకు బలమైన అభ్యర్థి లేక కాంగ్రెస్ తలలు పట్టుకుంది. ఇటీవల డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. దీంతో టికెట్ రేసులో కేఎల్‌ఆర్, మనోహర్‌రెడ్డి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కేఎల్‌ఆర్‌కు టికెట్ ఇప్పించేందుకు ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భర్త డాక్టర్ సంపత్‌కుమార్ డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి బరిలో ఉండేలా ప్రయత్నాలు చేస్తున్నారు. రమేష్ మహరాజ్, డాక్టర్ సంపత్‌ల రాజకీయ ఆధిపత్యం కొనసాగుతోంది. అయితే పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వర్గం నుంచి మనోహర్‌రెడ్డికి మద్దతు లభించగా, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌కు ఢిల్లీ పెద్దల ఆశీర్వాదం, బట్టి విక్రమార్క వర్గం సంపూర్ణ మద్దతు ఉంది. టికెట్ ఆశిస్తున్న ఇద్దరూ బలమైన నేతలు కావడంతో కాంగ్రెస్ తొలి జాబితాలో తాండూరు అభ్యర్థి పేరు ప్రకటించ లేదు.

రెండో విడతలో..

కాంగ్రెస్ రెండో విడత జాబితాలో తాండూరు అభ్యర్థి ఎవరనేది తేలనుంది. అయితే ఆ ఇద్దరు నేతలు ఎవరి వారు టికెట్ వస్తుందనే ధీమాతో పోటాపోటీ ప్రచారం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అసంతృప్తులను తమ వైపు తిప్పుకుంటున్నారు. మరోవైపు టికెట్‌పై స్పష్టత వచ్చాక బడా నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం సాగుతోంది. ఓ మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ మాజీ చైర్మన్ కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది.

హామీల అమలులో కేసీఆర్ విఫలం

- బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయారు
- మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్
- ద్యాచారంలో ఎన్నికల ప్రచారం



బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

అనంతగిరి: గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ మండలం ద్యాచారం గ్రామంలో పర్యటించారు. ముందుగా గ్రామంలోని బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు చెప్పే మాయ మాటలను నమ్మరాదని సూచించారు. సీఎం కేసీఆర్ హామీలు మాత్రమే ఇస్తారని, అమలు చేయరని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి మొదటి సీఎం దళితుడే అవుతాడన్న హామీని మొదలుకొని దళితులకు 3ఎకరాల భూమి, నిరుద్యోగ భృతి వంటివి అమలు కాలేదన్నారు. అంతేకాకుండా పథకాలను ఆర్భాటంగా ప్రారంభించి ఆ తరువాత పట్టించుకోరని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలనను గాలికొదిలేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయని, ప్రజలు ఈసారి తనను ఆశీర్వదించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, కిషన్‌నాయక్, సతీష్‌రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మర్పల్లి: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంసీఎం ఫంక్షన్ హాల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రకటించిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించడం ఖాయమని తెలిపారు. పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని అన్నారు. అనంతరం మర్పల్లి, పట్లూర్, పంచలింగాల, నర్సాపూర్ తండాకు చెందిన పలువురు నాయకులు, మర్పల్లి మండల మాజీ జెడ్పీటీసీ ఆర్ లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి గడ్డం ప్రసాద్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ -2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, మాజీ ఎంపీపీ నర్సింలు, జిల్లా నాయకులు శంకరయ్యగౌడ్, ఖలిమొద్దీన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్, మండల వర్కింగ్ ప్రసిడెంట్లు సురేష్, రఫీ, పార్టీ ఉపాధ్యక్షుడు సలీం, పట్లూర్ ఎంపీటీసీ స్వన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధారూరులో రూ.15.50 లక్షల నగదు సీజ్



తనిఖీల్లో పట్టుకున్న డబ్బులు చూపిస్తున్న సీఐ రామకృష్ణ

ధారూరు: ఎన్నికల తనిఖీల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ధారూరు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సాయినాథ్ నిర్వహించిన తనిఖీల్లో రూ.15.50 లక్షల నగదును పట్టుకున్నామని సీఐ రామకృష్ణ తెలిపారు. ధారూరు నుంచి తాండూరు వైపు వెళ్తున్న ఫార్చునర్ వాహనం (టీఎస్ 34 జే 0599)లో తరలిస్తున్న రూ.15.50 లక్షలను రిటర్నింగ్ అధికారులు సీజ్ చేశారని పేర్కొన్నారు. డబ్బులకు సంబంధించిన సరైన ఆధారాలు చూపలేదని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వంట గ్యాస్ సిలిండర్లు సీజ్

ఇద్దరిపై కేసు

మోమిన్‌పేట: వంట గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన మోమిన్‌పేట్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. టాస్క్‌ఫోర్స్, పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో మండల పరిధిలోని ఏన్కతలకు చెందిన ఎర్ర వెంకటేశం ఇంట్లో 28, మోమిన్‌పేటకు చెందిన కమ్మరి చంద్రశేఖర్ ఇంట్లో ఏడు సిలిండర్లు లభ్యమయ్యాయి. వాటికి ఎలాంటి రశీదులు లేకపోవడంతో సిలిండర్లను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేశామన్నారు.

ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రైస్‌మిల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: వ్యవసాయ అనుబంధ రంగాల అభ్యున్నతికి ప్రభుత్వం అందజేస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సూచించారు. కుల్కచర్ల గ్రామ పరిధిలోని కాళమ్మ దేవాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైస్ మిల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ అధ్యక్షుడు రుద్రారెడ్డి, మండల రైతుబంధు కమిటీ అధ్యక్షులు రాజు, నాయకులు హరికృష్ణ, లక్ష్మణ్, చెల్లాపూర్ వెంకటేశ్, అనంతయ్య, మాలె కృష్ణయ్య ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

1.89 లక్షల నగదు స్వాధీనం

ఇబ్రహీంపట్నం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో 1.89 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మైబెల్లి తెలిపారు.

స్నేహ‘హస్తం’ ఇవ్వండి

- కాంగ్రెస్‌లోకి మున్సిపల్ ఛైర్‌పర్సన్ దంపతులకు ఆహ్వానం
- పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ హామీ
- సన్నిహితులతో చర్చించి చెబుతామన్న చిగుళ్లపల్లి మంజులారమేశ్



చైర్ పర్సన్ మంజులారమేశ్ దంపతులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ప్రసాద్ కుమార్

వికారాబాద్ అర్బన్: కాంగ్రెస్ తొలి జాబితా అనంతరం వికారాబాద్‌లో రాజకీయం రసవత్తరంగా మారింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, ఆమె భర్త మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్‌కు.. ఎమ్మెల్యే ఆనంద్ మధ్య కొంతకాలంగా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. చైర్‌పర్సన్‌గా తమను స్వేచ్ఛగా పనులు చేయనీయలేదని.. తీవ్రంగా వేధించారని ఎన్నోసార్లు బాహాటంగానే ఆరోపించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనంద్‌కు టికెట్ ఇవ్వొద్దని వ్యతిరేకించిన వారిలో రమేష్ కుమార్ సైతం ఉన్నారు. ఒకటి రెండు సార్లు అసమ్మతి వర్గంతో పెద్ద ఎత్తున సమావేశాలు నిర్వహించి ఎమ్మెల్యే తీరును ఎండగట్టారు. దీంతో ఎమ్మెల్యే ఆనంద్‌కు చైర్ పర్సన్, చైర్ పర్సన్ భర్తకు మరింత గ్యాప్ పెరిగింది. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చాక ఆయన అసమ్మతి నాయకుల ఇంటికి వెళ్లి మద్దతివ్వాలని కోరారు. కానీ చైర్‌పర్సన్ దంపతులను కలవలేదనే ప్రచారం ఉంది. మూడు రోజులుగా మున్సిపాలిటీలో బీఆర్ఎస్ ప్రచారం సాగుతోంది.. ఇదే సమయంలో సంప్రదిస్తారని అనుకున్నా పట్టించుకోకపోవడంతే వారిలో అసంతృప్తి తారాస్థాయికి చేరిందని వార్త చక్కర్లు కొడుతోంది. వారి అసంతృప్తిని గుర్తించిన కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యానారాయణ, కిషన్ నాయక్, మైపాల్‌రెడ్డితో కలిసి చైర్‌పర్సన్ నివాసానికి వెళ్లారు. కాంగ్రెస్‌లో చేరితే సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తన విజయానికి ప్రత్యక్షంగా సహకరించాలని కోరారు. సన్నిహితులతో చర్చించాకే తమ నిర్ణయం ప్రకటిస్తామని వారు మాజీ మంత్రికి చెప్పినట్లు సమాచారం. కాగా వీరు పార్టీ మారితే అధికార బీఆర్ఎస్ గట్టి దెబ్బ తగిలినట్లేనని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. వీరు పార్టీ మారుతారా లేదా వేచి చూడాలి.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

దారూరు: ధారూరు మండల కేంద్రానికి చెందిన జీవీకే బిల్డర్స్ నిర్వాహకుడు దస్తయ్యతో పాటు పలువురు కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ప్రసాద్‌కుమార్ వీరికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

మా నాన్న మీ మధ్యే ఉంటాడు



ప్రచారంలో ప్రసాద్‌కుమార్ కూతురు అనన్య

ధారూరు: మా నాన్నని ఆశీర్వదించి అసెంబ్లీకి పంపిస్తే మీ మధ్యే ఉంటాడని వికారాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్ కుమార్ కూతురు అనన్య అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మండల పరిధిలోని కాచారంలో శుక్రవారం భర్త చేతన్‌తో కలిసి పర్యటించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ మోసాలకు మీ ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. హస్తం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాములు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పి.బసప్ప, నాయకులు మహ్మద్ బాబాకాన్, రమేశ్‌కృష్ణ, గోవర్ధన్, ముజాఫర్ తదితరులు పాల్గొన్నారు.

మీ గుండాగిరీకి భయపడం



మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరిన బీఆర్ఎస్ చంద్రవంచ నాయకులు

- మా కార్యకర్తల జోలికొస్తే తరిమికొడుతాం
- తాండూరులో ఈసారి కూడా కాంగ్రెస్‌దే విజయం
- డీసీసీబీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి
- హస్తం గూటికి పలువురు బీఆర్ఎస్ నాయకులు

తాండూరు రూరల్: ‘మీ గుండాగిరీకి భయపడే వాడిని కాదని.. మా నిజ స్వరూపం చూపిస్తే అడ్రస్ లేకుండా పోతారు’ అని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని నారాయణపూర్, వీర్‌శెట్టిపల్లి, గోనూర్, బిజ్వార్, బెల్కటూర్, చంద్రవంచ గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్‌లను.. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. ఇది ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల జోలికొస్తే తరిమి కొడుతామని మండిపడ్డారు. తాండూరులో ఈసారి కూడా కాంగ్రెస్ అభ్యర్థే గెలుస్తారని ధీమా వ్యక్తంచేశారు. తమ ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. గ్రామాల్లో ఒక్కరికి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వలేదన్నారు. తాండూరు ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే కాంగ్రెస్‌లో చేరానని, అవసరమైతే తల నరుక్కుంటా కానీ పార్టీ మారే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీను, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, బోయ అశోక్, చంద్రవంచ విజయ్‌కుమర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, విజయ్ కుమార్, నాగరాజు, మల్లికార్జున్, జగదీష్, గోవింద్‌భీంరెడ్డి, సాయిలు, హన్మంత్, మహేందర్‌గౌడ్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కంకల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి

పూడూరు: పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మంచన్‌పల్లి, కంకల్, చన్గోముల్ గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించారు. వసతులు సక్రమంగా ఉన్నాయనేది పంచాయతీ, గ్రామస్తులతో అడిగి తెలుసుకున్నారు. సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి సీఐ వెంకటరామయ్య, చన్గోముల్ ఎస్ఐ గిరి తదితరులు పాల్గొన్నారు.



ధారూరు: పూజారి చెన్నబసవయ్యస్వామి ఇంటి ఎదుట బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు

జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. మహిళలు, యువతులు పూలతో బతుకమ్మలు పేర్చి.. వీధుల్లో పెట్టి ఆడిపాడుతున్నారు. అనంతరం సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తున్నారు.



తాండూరులోని శాంతినగర్‌లో బతుకమ్మ సంబరాల్లో మహిళలు

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి

- కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు
- బీజేపీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి



కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి

దోమ: బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దొంగ ఎన్కెపల్లి, గూడూర్, మైలారం, దోర్నాల్‌పల్లి, గొడుగోనిపల్లి, బాస్‌పల్లి, బొంపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత ప్రధాని నరేంద్రమోదీ గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. ముద్రా యోజన, జన్‌ధన్ యోజన, అవాస్ యోజన, అటల్ పెన్షన్ యోజన, గ్రామ్ జ్యోతి యోజనలాంటి పథకాలను ప్రవేశపెట్టి నేరుగా ప్రజలకు అందుస్తోన్నరని వివరించారు. రాష్ట్రంలో మాత్రం సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాల పేరుతో తెలంగాణను అప్పుల పాలు చేశారని ఆరోపించారు. ప్రజలకు అందని ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చి కేవలం అధికార పార్టీ నేతలకే కట్టబెట్టారని ఆరోపించారు. పేద ప్రజలకు ఏ ఒక్క పథకం సక్రమంగా లబ్ధి చేకూరలేదని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలంతా బీజేపీ ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోని బీజేపీకి ఓటు వేసేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పుట్టి గోపాల్, ఆంజనేయులు, యాదవరెడ్డి, పులిందర్‌రెడ్డి, శివతేజ, వెంకటేశ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో నుంచి మంగళసూత్రం చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలోనుంచి మంగళసూత్రం ఎత్తుకెళ్లిన సంఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడ నీలం సంజీవరెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న రజిత శుక్రవారం సాయంత్రం ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో చొరబడి రజిత మెడలో ఉన్న మంగళసూత్రం లాక్కొని పారిపోయాడు. గమనించిన రజిత అతడిని ఫాలో అవ్వగా చెరువు వైపు పరిగెత్తినట్లు తెలిపింది. మహేశ్వరం జోన్ డీసీపీ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి గురువారం రెక్కీ నిర్వహించినట్లు సీసీ కెమెరాల ఆధారంగా తెలుసుకున్నారు. త్వరలో నిందితుడిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

ఆర్టీసు బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మైబెల్లి తెలిపిన వివరాలు.. ఇబ్రహీంపట్నంలోని శాస్త్రా గార్డెన్ వద్ద శుక్రవారం సుమారు 55 ఏళ్లున్న ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా యాచారం నుంచి ఇబ్రహీంపట్నం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో అతడు అక్కడికక్కడే చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతిపక్షాల హామీలు నమ్మొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

- వారు ఇచ్చేది లేదు.. సచ్చేదిలేదు
- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: ఎన్నికల కోసం ప్రతిపక్షాలు ఇస్తున్న హామీలు నామమాత్రమేనని అవి వారు ప్రజలకు ఇచ్చేదిలేదు.. సచ్చేదిలేదని ఆ పార్టీలకు ఓటు అడిగే అర్హత కూడా లేదని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో శుక్రవారం నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్‌పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేసీఆర్‌ది కుటుంబ పాలన అంటున్న కాంగ్రెస్‌పార్టీది కుటుంబపాలన కాదా అని ప్రశ్నించారు. ఆ పార్టీ చెబుతున్న ఆరు గ్యారంటీ పథకాలను వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేసి చూపించాలని, అప్పుడే ప్రజలు నమ్ముతారని తెలిపారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధిస్తారని చెప్పారు. ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికి, ప్రతి గుండెకు అండగా ఉంటామనే భరోసా ఉందన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలతో ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకు వచ్చారన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. ప్రతిపక్షపార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేదని ఇప్పుడు అవకాశం ఇస్తే చేస్తామని చెప్పే మాటలు ఎవరూ నమ్మరన్నారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గంలో ఏ మండలం అయితే ఎమ్మెల్యేకు అత్యధిక మోజార్టీ సాధిస్తుందో ఆ మండలానికి సొంతగా రూ.50లక్షలు అందిస్తానని ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి, రూ.5లక్షల నగదును అందిస్తామని మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్ ప్రకటించారు. కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్, నాగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, మహేందర్ రెడ్డి, వాసుదేవ్‌కన్న, ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతి, మహిళా అధ్యక్షురాలు స్వప్న, పలువురు సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



ఊయల లేక గొలుసులకు వేలాడుతున్న చిన్నారులు



పూర్తిగా పాడైన ఆట వస్తువు

వెక్కిరిస్తున్న ఆట వస్తువులు!

మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న గాంధీ పార్కులో ఆట వస్తువులు పూర్తిగా పాడైపోయాయి. సెలవులు కావడంతో ఎంతో ఆశగా ఆడుకునేందుకు ఇక్కడికి వస్తున్న చిన్నారులు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న పార్కుపై అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేదనే విమర్శలు ఉన్నాయి. వస్తువులు కొన్ని పాడైపోగా, కొన్ని చోరీకి గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. పాడైన వాటిని మరమ్మతు చేయించడం, కొత్తవి ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

– వికారాబాద్ అర్బన్



పాడైపోయిన ఆట వస్తువులు

మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ మహిళా నాయకులు, కార్యకర్తలు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 31వ డివిజన్ జనప్రియ మహానగర్ కాలనీకి చెందిన పలువురు బీజేపీ మహిళా నాయకులు శుక్రవారం బీజేపీలో చేరారు. స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. వీరిలో పద్మనాగభూషణం, రోజా, వాణి, కల్పన, నందిత, సురేఖ, మానస, శోభ, సుభాషిణి, మహేశ్వరి, లావణ్య, సునీత, విజయలక్ష్మి, కౌసల్య, పుణ్య, ప్రమీల, లలిత, లక్ష్మి, మానికతో పాటు రఘునాథ్, రహీంఖాన్, పి.సత్యనారాయణ, సీహెచ్.సత్యనారాయణ, చొక్కారావు, నితీష్‌లకు మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు మహిళలు తెలిపారు.